క్లుప్తంగా

108లో గర్భిణి ప్రసవం



శిశువుతో 108 సిబ్బంది

ఆత్మకూరు : మండలంలోని హౌజ్‌బుజుర్గు గ్రామానికి చెందిన గర్భిణి సయ్యద్ ఖతిన్ బీ 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. ఆమె సోమవారం ఉదయం పురిటి నొప్పులతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు 108కి ఫోన్ చేశారు. దీంతో స్పందించిన 108 సిబ్బంది గ్రామానికి వెళ్లి ఆమెను హనుమకొండలోని ప్రసూతి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు తీవ్రం కావడంతో వాహనంలోనే ఈఎంటీ నంగునూరి రామ్మూర్తి, పైలట్ ముత్యాల ప్రకాశ్ ప్రసవం చేశారు. ఆమె పండంటి ఆడశిశువుకు జన్మనిచ్చింది. అనంతరం తల్లిని, శిశువును సిబ్బంది హనుమకొండలోని ప్రసూతి ఆస్పత్రిలో చేర్పించారు. 108 సిబ్బందిని ఖతిన్ బీ బంధువులు, కుటుంబసభ్యులు, పలువురు అభినందించారు.

కొత్తకొండ వీరభద్రస్వామికి డీఐజీ పూజలు



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామికి హైదరాబాద్ డీఐజీ ఎస్.ప్రకాశ్‌రెడ్డి సోమవారం పూజలు నిర్వహించారు. ఆయన కుటుంబసమేతంగా ఆలయాన్ని సందర్శించారు. ప్రకాశ్‌రెడ్డి కుటుంబానికి అర్చకులు ఘన స్వాగతం పలికి స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ప్రకాశ్‌రెడ్డి కుటుంబాన్ని అర్చకులు స్వామి వారి శేషవస్త్రంతో సన్మానించి ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కిషన్‌రావు, ఉప ప్రధాన అర్చకులు రాజయ్య, ముఖ్య అర్చకులు నందనం సదానందం, రాంబాబు, శ్రీకాంత్, రమేష్, వీరభద్రయ్య, శివకుమార్, శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కాజీపేట: అధిక లాభాల ఆశతో నాణ్యత లేని విత్తనాలను విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందితే సదరు దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి దొండపాటి శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. కాజీపేట పట్టణంలో విత్తన విక్రయ కేంద్రాల్లో పోలీసులతో కలిసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాసిరకం విత్తనాలను విక్రయిస్తే దుకాణాలను జప్తు చేస్తామని, అధిక ధరలకు విక్రయాలు చేయవద్దని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను దుకాణదారులు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.

మల్లన్న ఆలయంలో అఘోర పాశుపత జపాలు

కాజీపేట: కాజీపేట పట్టణంలోని భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో అఘోర పాశుపత జపాలు సోమవారం ముగిశాయి. పూజల్లో భాగంగా స్వామి వారిని పలు రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ఐనవోలు ప్రవీణ్‌కుమార్‌శర్మ మాట్లాడుతూ సోమవారం స్వామివారికి విశిష్టమైన దినం కావడంతో భక్తులందరికి ప్రత్యేక దర్శనం కల్పించామని, అభిషేకాలు నిర్వహించామని తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు శివ – శక్తి యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో రైతులకు మజ్జిగ పంపిణీ

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో రైతులు, సిబ్బంది, కార్మికులకు మన అగ్రిటెక్ ఆధ్వర్యంలో సంస్థ ఎండీ పాశికంటి రమేష్ సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత వల్ల ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో రైతులకు ఉపశమనం కోసం మజ్జిగ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు, మార్కెట్ సిబ్బంది, మన అగ్రిటెక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా అర్చక ఫెడరేషన్ సమావేశం

హన్మకొండ కల్చరల్ : ఆల్ ఇండియా అర్చక ఫెడరేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలో ఆల్ ఇండియా అర్చక ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారి శేషగిరిరావు (భద్రకాళి శేష) అధ్యక్షతన సోమవారం సమావేశం జరిగింది. ఈమేరకు పలు రాష్ట్రాల అర్చక ఫెడరేషన్ సభ్యులు పాల్గొని బ్రాహ్మణ సంక్షేమ పథకాల గురించి చర్చించారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

● వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్

ఐనవోలు : దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ కోరారు. మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అన్ని శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వరాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు పూర్తైన సందర్భంగా ప్రభుత్వం 21 రోజులపాటు దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి నిర్ణయించిందని తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గవ్యాప్తంగా ఉత్సవాల నిర్వహణకు సంబంధించి అధికారులు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేయడానికి హనుమకొండ హంటర్ రోడ్డులోని విష్ణుప్రియ గార్డెన్‌లో (నేడు) మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్



సంపత్‌ను కన్వీనర్‌గా ప్రకటిస్తున్న ఎమ్మెల్యే

రైతుబంధు కన్వీనర్‌గా సంపత్‌కుమార్

మండల రైతుబంధు కన్వీనర్‌గా ఐనవోలు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మునిగాల సంపత్ కుమార్‌కు అవకాశం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే అరూరి రమేశ్ ప్రకటించారు. తనపై నమ్మకం ఉంచి మరోసారి పదవి అప్పగించినందుకు ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కు సంపత్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఎంపీపీ మార్నేని మధుమతి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పోలెపల్లి శంకర్‌రెడ్డి, బుర్ర రాజశేఖర్, సర్పంచ్ జన్ను కుమారస్వామి, నాయకులు ఆడెపు దయాకర్, సింగారపు రాజు, భైరి వెంకటయ్య, తండ వెంకన్న, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత

● వైద్యాధికారి ఆకుల సంజీవయ్య

పరకాల : రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి ఆకుల సంజీవయ్య అభివర్ణించారు. ఆరోగ్యవంతులు జీవితంలో 160 సార్లు రక్తదానం చేయొచ్చని స్పష్టం చేశారు. ఆ ఆస్పత్రిలో ఏఏహెచ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. సుమారు 30 మంది యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన తెలిపారు. ప్రతిరోజూ అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో చాలా మంది అత్యవసర సమయాల్లో రక్తం సమయానికి అందకపోవడంతో చనిపోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. బాధిత కుటుంబాలు రోడ్డున పడుతున్న దుస్థితి నెలకొంటోందని తెలిపారు. ఈ క్రమంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు ఫౌండేషన్ ప్రతినిధులు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ బాలకృష్ణ, ఫౌండేషన్ సభ్యులు ముదసీర్, నితిన్, ఎం,విశాల్, ఉత్కర్ష్, రాహుల్, ఉమేష్, రోహిత్, పవన్, విశాల్ శివమణి తదితరులు పాల్గొన్నారు.



ఫౌండేషన్ సభ్యులను అభినందిస్తున్న సంజీవయ్య

ధాన్యం విక్రయంలో రైతులకు ఇబ్బందులు

● మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి

నడికూడ : ధాన్యాన్ని విక్రయించడంలో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదని బీజేపీ నేత, పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి ఆందోళన వెలిబుచ్చారు. మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డితో కలిసి భిక్షపతి సోమవారం సందర్శించారు. కొనుగోళ్లపై ప్రత్యక్షంగా పరిశీలించారు. ధాన్యం విక్రయించడంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం భిక్షపతి మాట్లాడారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులు రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని తెలిపారు. ధాన్యాన్ని మిల్లర్లకు పంపించే బాధ్యత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులదే అయినా అధికారులు పట్టించుకోకపోతుండడంతో రైతులే తరలించుకోవాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. కొనుగోలు కేంద్రం వద్ద తాగునీటి, ఇతర కనీస వసతులు సైతం కల్పించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రచారం చేస్తూనే రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ దళారులకు ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించుకునే పరిస్థితి కల్పిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు ధాన్యాన్ని నిర్వాహకులే మిల్లులకు పంపించేలా చూడాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకుని రైతులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోగుల రాజిరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా జనరల్ సెక్రటరీ సింగవేన రవీందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మొలుగూరి భిక్షపతి, తదితరులు

హరితహారం మొక్కలు దగ్ధం.. రైతుకు జరిమానా

దామెర : మండల కేంద్ర సమీపంలో నాటిన హరితహారం మొక్కలు దగ్ధం కాగా అందుకు బాధ్యుడైన రైతుకు జరిమానా విధించినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రం నుంచి జాతీయ రహదారికి వెళ్లే దారిలో రైతు అర్జం ఓదెలు మొక్కజొన్న వ్యర్థాలను కాలుస్తుండగా మంటలు వ్యాపించి సమీపంలో ఉన్న హరితహారం మొక్కలకు అంటుకొని కాలిపోయాయి. దీంతో విషయం తెలుసుకున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ కుసుమ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకొని నీళ్ల ట్యాంకర్‌తో మంటలను ఆర్పివేశారు. కొన్నేళ్లపాటు పెంచిన హరితహారం మొక్కలు కాలడానికి కారణమైన ఓదేలుకు గ్రామ పంచాయతీ ద్వారా రూ.1200 జరిమాన విధించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. హరితహారం మొక్కలను ఎవరైనా కాల్చినా, ధ్వంసం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

‘క్వారీ ఏర్పాటుకు అనుమతించొద్దు’

ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి గ్రామంలో కొత్తగా గ్రానైట్ క్వారీ ఏర్పాటుకు అనుమతించొద్దని ఎంపీటీసీ వల్లపురెడ్డి రమాదేవి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు, మత్స్యకారులు, గొల్ల కురుమలపాటు ఆమె జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం రమాదేవి మాట్లాడారు. గ్రానైట్ తవ్వకాల వల్ల ప్రకృతిలో కాలుష్యం పెరుగుతోందని చెప్పారు. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సైతం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. తవ్వకాలు నిర్వహించడానికి నిర్ణయించిన నదిమిబోడు పరిసరాల్లోని వందల ఎకరాల భూముల్లో రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారని తెలిపారు. రైతులకు తీవ్ర నష్టం కలిగించనున్న క్రమంలో క్వారీ అనుమతులను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మాదికంటి రాజయ్య, ఉపసర్పంచ్ పుట్ట వెంకట్రాజం, మాజీ ఉపసర్పంచ్ పుట్ట కుమార్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బాషబోయిన రాజయ్య, వార్డు సభ్యులు గంటె సరిత, కుందేళ్ల రేణుక, అనూష, గొల్ల కురమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ రమాదేవి

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ గ్రామానికి చెందిన పులుగం చంద్రమౌళి (65) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. ఎస్సై ఎం.సతీష్ కథనం ప్రకారం.. చంద్రమౌళి వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురైయ్యాడు. ఈ క్రమంలో తీవ్ర వేదనకు గురైన చంద్రమౌళి ఈనెల 28న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను 108 అంబులెన్స్‌లో హుజురాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తదనంతరం మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా ఎంజీఎంలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కొడుకు రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

నైపుణ్యం పెంచుకుంటేనే ఆర్థికాభివృద్ధి

నడికూడ : నైపుణ్యం పెంచుకుంటేనే ఆర్థిక అభివృద్ధి సాధించగలరని ఎంపీపీ మచ్చ అనసూర్య తెలిపారు. మండలం కేంద్రంలో నాబార్డ్ సహకారంతో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళలకు జీవనోపాధులు, వ్యాపార సంస్థల అభివృద్ధి, ఫుడ్ ప్రసాసింగ్‌పై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ కోడెపాక సుమలతతో కలిసి ఎంపీపీ అనసూర్య సోమవారం సందర్శించి పరిశీలించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. ఆహార పదార్థాల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్‌లో నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. ఏపీఎం రమాదేవి మాట్లాడుతూ ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు కోసం ఐకేపీ ద్వారా మహిళలకు రుణాలు ఇప్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఫుడ్ ప్రాసెసింగ్ ట్రైనర్ షరీఫా, సర్వోదయ ఆర్గనైజేషన్ ప్రతినిధులు చాపర్తి రవీందర్, శ్రీలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

జెడ్పీటీసీకి ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పరామర్శ



ఎల్కతుర్తి : నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీటీసీ



శాయంపేట : నివాళులర్పిస్తున్న ప్రభాకర్

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి జెడ్పీటీసీ వంగ రవీందర్‌ను అతడి తల్లి కొమురమ్మ ఇటీవల మృతి చెందిన క్రమంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, హనుమకొండ జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్ కుమార్ సోమవారం పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల అనిత, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి, సర్పంచ్ మాడ్గుల కొమురయ్య, ఎంపీటీసీలు బొల్లపల్లి రమేష్, అప్పని పద్మ పాల్గొన్నారు.

మామిడి హరికృష్ణకు..

శాయంపేట : తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణను అతడి తండ్రి డాక్టర్ సుదర్శన్ చనిపోయిన సందర్భంగా మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. డాక్టర్ సుదర్శన్ ఇటీవల మృతి చెందగా మండల కేంద్రంలోని ఎస్‌వీకేకే ఫంక్షన్ హాలులో నిర్వహించిన దశదిన కర్మకు పొన్నం ప్రభాకర్ హాజరై హరికృష్ణను ఓదార్చారు. హరికృష్ణను పరామర్శించిన వారిలో గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, సీనియర్ జర్నలిస్ట్ వల్లాల వెంకటరమణ, మాజీ స్పీకర్ ఓఎస్డీ గడ్డం భాస్కర్, సర్పంచ్ కందగట్ల రవి, ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్ తదితరులున్నారు.

ఆర్థికసాయం



నడికూడ : మండలంలోని ముస్త్యాలపల్లె గ్రామానికి చెందిన నార్ల లక్ష్మినారయణ ఇటీవల మృతి చెందగా కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంక్రటాంరెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులు బాధిత కుటుంబానికి ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్థికసాయం అందించారు. తొలుత బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు బందెల దామోదర్, మహ్మద్ రంజాన్, బొట్ల అనిల్, బొట్ల సురేందర్, వార్డ్ సభ్యుడు బందెల రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సభను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : జూన్ 1న మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న రెడ్డి కులస్తుల ఆత్మీయ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు కొమ్మిడి జితేందర్‌రెడ్డి కోరారు. సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రూ.5 వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, విదేశీ విద్యా నిధి పథకాన్ని పేద రెడ్డి కులస్తులకు వర్తింపజేయాలని, రాష్ట్రంలో జనరల్ కేటగిరీలో నడుస్తున్న గురుకులాల సంఖ్యను 100కు పెంచాలని, పేద రెడ్డి రైతులకు రూ.5 లక్షల పరిమితితో హెల్త్ కార్డులు ఇవ్వాలని, హైదరాబాద్‌లో ఐదెకరాలు కేటాయించి రెడ్డి సంక్షేమ భవన్ నిర్మాణానికి రూ.10 కోట్లు అందించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఐక్యతతో ఉంటేనే హక్కులు సాధించుకోగలమని స్పష్టం చేశారు. ఆత్మీయ సభకు మండలంలోని రెడ్డి కులస్తులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మిడి నిరంజన్‌రెడ్డి, నాయకులు ఎడెల్లి రాంసుధాకర్‌రెడ్డి, కొమ్మిడి రమణారెడ్డి, పెండ్యాల మహేందర్‌రెడ్డి, సల్లా కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సభను జయప్రదం చేయాలి



దామెర : కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు



కమలాపూర్‌లో..

దామెర : హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో జూన్ 4న సాయంత్రం 5 గంటలకు తలపెట్టిన ఎమ్మార్పీఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ గద్ద సుకుమార్ కోరారు. సభకు సంబంధించిన కరపత్రాలను మండలంలోని పులుకుర్తి గ్రామంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుకుమార్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సభకు మాదిగ, ఉపకులాల ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ జిల్లెల్ల మురళీ, నాయకులు గోవిందు కరుణాకర్, బొట్ల ప్రశాంత్, గోవిందు అభిలాష్, గోవిందు మహిపాల్, గోవిందు ఆదాయం, జిల్లెల్ల సుబ్బయ్య, దయాకర్, గోవిందు సౌందర్య, బొట్ల శిరీష, జిల్లెల్ల లావణ్య, బొర్ర మల్లమ్మ పాల్గొన్నారు.

కమలాపూర్ : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత సాధనకై హనుమకొండలోని ఆర్ట్స్, సైన్స్ కళాశాల ఆడిటోరియంలో జూన్ 4న నిర్వహించ తలపెట్టిన సభను విజయవంతం చేయాలని ఎమ్మెస్పీ జిల్లా కన్వీనర్ గంగారపు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఎమ్మెస్పీ జిల్లా నాయకుడు చిలువేరు సంపత్ ఆధ్వర్యంలో కమలాపూర్‌లో సభ కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ మండల నాయకులు వేలుగొండ భద్రయ్య, శనిగరపు సుధాకర్, చెరిపెల్లి కుమారస్వామి, అంకిల్ల రాజమల్లు, శనిగరపు ఆనందం, పోడేటి మొగిలి, ఇమ్మడి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

అతిథి ఆశ్రమంలో అయ్యప్ప పడిపూజ

హన్మకొండ కల్చరల్: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ రెడ్డికాలనీలో అతిథి దివ్యాంగుల ఆశ్రమంలో అయ్యప్ప స్వామి పడిపూజ, అన్నదానం కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. వాగ్దేవి సరస్వతి ఆలయం అర్చకుడు శరత్‌శర్మ, ధర్మ ప్రచారసభ ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్, ట్రస్ట్ సభ్యుడు రాజర్ల రమేష్, స్టేట్ జాయింట్ సెక్రటరీ వీరస్వామి గౌడ్, జిల్లా అధ్యక్షుడు భయాన సంతోష్, సెక్రటరీ పెరుమాండ్ల శ్రీనివాస్‌గౌడ్, దూశెట్టి భాస్కర్, జితేందర్‌స్వామి, రమాకాంత్‌రెడ్డి, బాలరాజ్, వెంకన్న, సాగర్, బాలాజీ, అజయ్, రాజ్‌కుమార్, ఆశ్రమ ఇన్‌చార్జ్ సుజాత, రత్నం తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలను వినియోగించుకోవాలి

పరకాల : రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ కోరారు. ఆ పార్టీ పరకాల నియోజవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి సూచనలతో పట్టణంలోని యువతీ యువకులతో కలిసి వాల్‌పోస్టర్లను సోమవారం శ్రీనివాస్ ఆవిష్కరించి మాట్లాడారు. పోటీలో 16 నుంచి 35 ఏళ్ల వరకు వయస్సున్న యువత అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు సెల్ నంబర్ 7661899899కు మిస్డ్ కాల్ ఇవ్వాలని సూచించారు. అనంతరం మెసేజ్ ద్వారా లింక్‌ను ఓపెన్ చేసి అప్లికేషన్ నింపాలని తెలిపారు. తదనంతరం రెఫరెన్స్ ఐడీ నంబర్ 25501 నమోదు చేయాలని చెప్పారు. ఆన్‌లైన్ ఎగ్జామ్‌లో సమర్థత చాటిన వారికి బహుమతులు (ల్యాప్‌ట్యాప్, స్మార్ట్ ఫోన్, ట్యాబ్, తదితర ప్రోత్సహకాలు) అందజేస్తారని వివరించారు. కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ పార్టీలు అవలంభిస్తున్న తప్పుడు విధానాలతో ప్రజలు విరక్తి చెంది కాంగ్రెస్ వైపు చూస్తున్నారని తెలిపారు. రానున్న అన్ని ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు బొచ్చు చందర్, పట్టణ ప్రధాన కార్యదర్శులు చందుపట్ల రాజిరెడ్డి, పబ్బ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అలీ, పోరండ్ల వేణు, బొచ్చు కట్టయ్య తదితరులు పాల్గొన్నారు.




వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

బీజేపీ గెలుపునకు కృషి చేయండి

ఎల్కతుర్తి : రాబోయే ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ నేత జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి కోరారు. భీమదేవరపల్లి మండలంలో పైడిపల్లి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి సురేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చైతన్యవంతం చేయడంతోపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని శ్రేణులకు సూచించారు. సమావేశంలో ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ నర్సింగరావు, నాయకులు మాచర్ల కుమారస్వామి, ప్రకాశ్, సారయ్య, సదానందం, సంపత్, కవిత, రవీందర్, లింగయ్య, మహేష్, భిక్షపతి, శ్రీనివాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపు, సేఫ్టీపై అవగాహన

హసన్‌పర్తి: వయో వృద్ధుల సంక్షేమ సంస్థ విద్యారణ్యపురి, హెల్పేజ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో వయోవృద్ధుల సంక్షేమ సంస్థ అధ్యక్షుడు నర్సయ్య అధ్యక్షతన డిజిటల్ సేఫ్టీపై గోపాలపురంలోని ఎస్సార్ స్కూల్‌లో సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా హెల్పేజ్ ఇండియా కౌన్సిలర్ శ్యాంకుమార్ మాట్లాడుతూ ఆధునిక విధానం డిజిటల్ ట్రాన్స్‌ఫర్ సిస్టం ద్వారా ఆన్‌లైన్‌లో డబ్బులను చలామణి చేయవచ్చని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తేరాల యుగంధర్, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వీరన్న, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి విద్యాసాగర్, సభ్యులు కొండబత్తిని రాజేందర్, వేణు, సాంబయ్య, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్యాంకుమార్

ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలి

హన్మకొండ అర్బన్: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా సమ్మర్ క్యాంపుల పేరుతో విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ డిమాండ్ చేశారు. నిబంధనలు తుంగతో తొక్కి విచ్చలవిడిగా ఫీజుల వసూలు చేస్తున్న ఏకశిల విద్యాసంస్థలను మూసివేసి, చైర్మన్ తిరుపతిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడికి సోమవారం యత్నించారు. ఈక్రమంలో నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మంద నరేష్ మాట్లాడుతూ విద్యార్థుల నుంచి అక్రమంగా వసూలు చేసిన ఫీజులను ఏకశిల సంస్థ తిరిగి చెల్లించేవరకు తమ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు మచ్చ పవన్, ఉపాధ్యక్షుడు మధుగౌడ్, ఆర్ట్స్ కళాశాల అధ్యక్షుడు శనిగరపు సుమంత్, నాయకులు ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.